క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్ఎస్ 33/11 కేవీలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 డివిజన్ ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా శీలానగర్, గవరజగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, హరిజన జగ్గయ్యపాలెం, పోర్టు రోడ్డు ఏరియా, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో రూ.35 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. సర్వీసు రోడ్డు పక్కనున్న గ్రానైట్ షాపు పక్కనుంచి బంగారుమాంబ అమ్మవారి ఆలయం వరకు హాట్ మిక్స్ తారు రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి



తిరువీధి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యంలో బుధవారం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి, పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. సాయినగర్, శనివాడ వేప చెట్టు, ప్రశాంతినగర్‌ల మీదుగా ఊరేగింపు సాగింది. కోలాట బృందాలు, సాము గరిడీలతో ఉత్సవం జరిపించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి సహకరించాలని వినతి



మేయర్ హరి వెంకట కుమారికి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి

అగనంపూడి: వార్డు అభివృద్ధికి సహకరించాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి కోరారు. మేయర్‌ను ఆమె చాంబర్‌లో కలిసి, వినతిపత్రం అందించారు. ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీల్లో కైలాసభూమికి స్థలం కేటాయింపు, ధోబీఖానాకు స్థలం కేటాయింపు.. నిర్మాణం, రోడ్లు డ్రైనేజీల నిర్మాణం తదితర అంశాలను మేయర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఫార్మా నిర్వాసిత వివాహిత కుమారుల్లో మిగిలిన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి, పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

వసుధ ఫౌండేషన్ వితరణ

గాజువాక: సామాజిక సేవలను అందిస్తున్న పలు సంస్థలకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు ఆర్థిక సాయం అందజేశారు. తమ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల్లో భాగంగా ఈ సహాయం అందించినట్లు ఆయన తెలిపారు. హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చి సెంటర్‌లో రోగుల సహాయార్థం రూ.2 లక్షలు, మానవతా సేవా సంస్థ గాజువాక యూనిట్‌కు రూ.2లక్షలు, గాజువాక సత్యసాయి ఆర్గనైజేషన్‌కు రూ.1లక్ష సాయాన్ని వసుధ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ దీనంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.వి.సుబ్బరాజు, బి.వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సరికొత్తగా తహసీల్దార్ కార్యాలయం



గాజువాక తహసీల్దార్ కార్యాలయం



గాజువాక తహసీల్దార్ కార్యాలయం

- ఆధునిక హంగులతో పునర్నిర్మాణం
- నేడు ప్రారంభోత్సవం

తహసీల్దార్ కార్యాలయం ఆధునికీకరణ
నిధులు : రూ.5 లక్షలు



గాజువాక: గాజువాక **తహసీల్దార్ కార్యాలయం** కొత్తరూపును సంతరించుకుంది. గాజువాకలో పెరుగుతున్న సేవలకనుగుణంగా ఈ కార్యాలయంపై అదనపు అంతస్తు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు ఆ అంతస్తు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ భవనం పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పాటు పలువురు దాతలు వివిధ రూపాల్లో సహకరించారు. ఆధునిక హంగులతో నిర్మితమైన కార్యాలయాన్ని గురువారం ప్రారంభించడానికి కార్యాలయ సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆధునికీకరణ ఇలా..

- విశాలమైన ప్రాంగణంలో ఉన్న కార్యాలయంపై రూ.5 లక్షలతో అదనపు భవనం నిర్మించారు.
- ఇప్పటికే ఉన్న భవనంలో వివిధ మార్పులను చేశారు.
- ప్రతీ అధికారికి అనువైన విధంగా చాంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.
- వీడియో కాన్ఫరెన్స్‌లలో పాల్గొనే సిబ్బందికి కూడా సరిపోయే విధంగా తహసీల్దార్ చాంబర్‌ను తీర్చిదిద్దారు.
- వివిధ సేవల కోసం కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులు వేచి ఉండటం కోసం ఏర్పాటు చేసిన వెయిటింగ్ హాల్‌లో సౌకర్యవంతమైన కుర్చీలను ఏర్పాటు చేశారు.
- అదనపు అంతస్తులో విశాలమైన సమావేశ మందిరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.
- సమావేశంలో పాల్గొనే ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులు వేచి ఉండటం కోసం మరో గదిని ఏర్పాటు చేశారు.

సమర్థవంతంగా సేవలు



కార్యాలయాన్ని పునర్నిర్మించడంవల్ల మా సిబ్బంది మరింత సమర్థవంతంగా సేవలను అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ కార్యాలయానికి వచ్చే అర్జీదారులు వేచి ఉండటానికి కూడా ఏర్పాట్లు చేశాం. సమావేశాలు నిర్వహించుకోవడానికి తగిన హాల్ సమకూరింది. ఇది ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడుతుంది.

– శ్రీవల్లి, తహసీల్దార్



అర్జీదారుల వెయిటింగ్ హాల్



కార్యాలయంపై అదనపు అంతస్తు



మీటింగ్ హాల్

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



ఏబీఎస్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



వీఎస్ఈజెడ్‌లో సంక్రాంతి పొంగలి వండుతున్న ఉద్యోగులు

అగనంపూడి: సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ కంపెనీలో ఉద్యోగులు ముందుగానే పండగ సంబరాల్లో మునిగి తేలారు. భోగి మంటలు, గొబ్బెమ్మలు, చెరుకుగెడలు, గంగిరెద్దుల ఆటలు, రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, కోలాటంతో ఆవరణంతా సందడిగా మారింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కంపెనీ కార్యదర్శి శేఖర్ మువ్వా, వైస్ ప్రెసిడెంట్ బీఎస్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

- 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలోని ఏబీఎస్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



దువ్వాడ వీఎస్ఈజెడ్‌లోని సినర్జీస్ కంపెనీలో గంగిరెద్దు విన్యాసం

గాజువాక: స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో, ట్వింకిల్ కిడ్స్ స్కూల్‌లో, చలపతి పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను నేత్రపర్వంగా నిర్వహించారు.



భాస్కర్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు



ట్వింకిల్ స్కూల్‌లో చిన్నారుల సందడి

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



మొదటి బహుమతి పొందిన ముగ్గు

గాజువాక: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కేఎన్నార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ పోటీలను ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు సోంబాబు, శంకరరావు, బాటా శ్రీనివాస్, నాగేశ్వరరావు, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

అగనంపూడి: కదులుతున్న రైలు నుంచి జారిపడి, ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన దువ్వాడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్‌పీ ఔట్‌పోస్ట్ సిబ్బంది తెలిపిన వివరాలివి.. విశాఖ నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న రైల్లో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలు (70) బుధవారం తెల్లవారుజామున రైలు నుంచి జారిపడి, మృతి చెంది ఉంటుందని తెలిపారు. మృతురాలు నల్లరంగు చలి కోటు, ఆరెంజ్, ముదురు ఆకుపచ్చరంగు చీర ధరించి ఉన్నారని పేర్కొన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. వివరాల కోసం దువ్వాడ జీఆర్‌పీ ఔట్‌పోస్టులో సంప్రదించాలని కోరారు.

బాలికా సాధికారతే ఎన్టీపీసీ లక్ష్యం

ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా



బాలికలతో ప్రాజెక్టు హెడ్ సిన్హా, ఉన్నతాధికారులు




బాలికలకు యోగా కిట్లు అందజేస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: బాలిక సాధికారతే లక్ష్యంగా సింహాద్రి ఎన్టీపీసీ కృషి చేస్తుందని సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా చెప్పారు. దీపాంజలినగర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బాలికా సాధికారత మిషన్ వర్క్‌షాపును బుధవారం ప్రాజెక్టు హెడ్ సిన్హా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలు, యువతను నాయకులుగా తయారు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. తొలుత మండలంలోని 13 పాఠశాలలకు చెందిన 110 విద్యార్థులతో మిషన్ ప్రారంభమైందన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడి నేతృత్వంలో బాలికలకు స్వీయ విలువ, విశ్వాసంపై అవగాహన కల్పించడం జరిగిందని చెప్పారు. ఆధునిక ప్రపంచంలో సవాళ్లను ఎదుర్కొనే విధంగా బాలికలకు నైపుణ్యం కల్పించడమే సంస్థ లక్ష్యమని చెప్పారు.

కార్యక్రమంలో పాల్గొన్న బాలికలకు యోగా మ్యాట్‌లు, స్టేషనరీ వస్తువులతో కూడిన కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జీఎం నోవాహు గడ్డం, హెచ్‌ఆర్ హెడ్ బీబీపాత్ర, బాల భారతి పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ బి.పద్మజ, హెచ్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు, సీఎస్సార్ హెచ్‌ఆర్ శివప్రతాప్‌సింగ్, దీపిక లేడీస్ క్లబ్ సభ్యులు, బాలికలు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

విహార యాత్రతో విజ్ఞానం

మల్కాపురం: ఒత్తిడి నివారణతో పాటు విజ్ఞానం పెంచుకోవడానికి విహారయాత్రలు ఎంతో దోహదపడతాయని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల విద్యార్థులు బుధవారం ఉదయం నగరంలోని పలు పర్యాటక ప్రాంతాల్లో పర్యటించారు. తొట్లకొండ,శిల్పారామంజాతర, రుషికొండ,జూ ప్రాంతాలకు వెళ్లారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



విహార యాత్రలో సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులు

'కార్మికుల సమస్యలు పట్టని ఉక్కు యాజమాన్యం'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలపై యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని స్టీల్ సిటూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ విమర్శించారు. కార్మికుల డిమాండ్లపై యూనియన్ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు పోటీదారుగా ఉన్న జిందాల్‌తో ఒప్పందం చేసుకోవడం వల్ల స్టీల్‌ప్లాంట్ ప్రతిష్టకు భంగం కలుగుతుందన్నారు. ఈ అంశంపై కలుగుతున్న అనుమానాలను నివృత్తి చేయకుండా పెంచే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. ఈ ఒప్పందాన్ని రద్దు చేసి సెయిల్‌తో ఒప్పందం చేసుకోవాలన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ఉక్కు కార్మికులకు ఎన్‌జేసీఎస్ ఒప్పందంలో ఉన్న క్లాజులను తొలగించి వేతన సవరణ చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వై.టి.దాస్, మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, సురేష్‌బాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



ఉరుకూటి చందుకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న బోగాది

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రంలో సంక్షేమపాలన, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. 69వ వార్డులోని వైఎస్సార్ సీపీ ముఖ్యనాయకులతో నాతయ్యపాలెంలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాజువాక నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ప్రజలు ఆయనకు అందించిన సహకారం తనకు కూడా అందించాలని కోరారు. పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమిస్తానన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. అనంతరం ఉరుకూటి చందుకు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు, స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గం పరిశీలకుడు ఉరుకూటి అప్పారావు, వార్డు మహిళా అధ్యక్షురాలు కమరున్నీసా బేగం, నాయకులు గంగ్రెడ్డి రామునాయుడు, కాకి అప్పల రెడ్డి, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు వీర్రాజు, సాలాపు వెంకటరావు, కర్రి దాలినాయుడు, పెట్లి అప్పారావు, కె.సన్యాసిరావు, వెంకటేశ్వరరావు, అంగ బాబూరావు, టి.ఎల్.నర్సింగరావు, ఉరుకూటి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



పూజలు అందుకుంటున్న రామలింగేశ్వరుడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమా రామలింగేశ్వర ఆలయంలో బుధవారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో దేవతామూర్తులను అలంకరించి పూజలు చేశారు. వేకువజామున ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉక్కు కోక్‌ఓవెన్స్ అధికారి శ్రీనివాసరెడ్డి సహకారంతో నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, సుధాకర్, చీకటి శ్రీనివాస్ నాగేశ్వర శర్మ, రాధాకృష్ణ, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కమ్యూనిస్టు కార్మిక సంఘాల వల్లే కార్మికులకు కష్టాలు'



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

ఉక్కునగరం: కమ్యూనిస్టు కార్మిక సంఘాలు సీఐటీయూ, ఏఐటీయూసీల వల్లే స్టీల్ కార్మికులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతకు ముందు గుర్తింపులో ఉన్న సీఐటీయూ కార్మికులకు చెందిన అనేక ప్రయోజనాలను పోగొట్టిందన్నారు. తర్వాత గుర్తింపులోకి వచ్చిన ఏఐటీయూసీ హయాంలో కార్మికులు ఉన్న ప్రయోజనాలు కూడా కోల్పోతున్నారన్నారు. యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణకు ఐక్య పోరాటాలు చేస్తున్న నేపథ్యంలో వాటిని విచ్ఛిన్నం చేయడానికి కొంతమంది కుట్రలు చేస్తున్నారన్నారు. క్లాజులు, సబ్ క్లాజులు అంటూ నిందలు మాని, వేతన సవరణ అంశంపై కమ్యూనిస్టు సంఘాలు యాజమాన్యంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో కారు రమణ, బీఎంకె నాయక్, బీఎస్ రాజు, ఆకుల నూకరాజు, రాథోడ్, గొందేశి ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యూపీకి చెందిన వ్యక్తి మృతి



ప్రజాపతి రాంజీ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అనారోగ్యంతో ఇంట్లో మృతి చెందిన ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గాజువాక ఎస్ఐ హరికృష్ణ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రజాపతి రాంజీ (52) ఆటోనగర్‌లోని ఓ స్క్రాప్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇతడు ఒంటరిగా కాపులుప్పాడలో అద్దెకు ఉంటున్నాడు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న రాంజీ ఈ నెల 7వ తేదీన ఇంట్లో మృతి చెందాడు. రాంజీ మృతి చెంది ఉండటాన్ని పక్కింటి వాళ్లు గుర్తించి వలంటీర్‌కు తెలియజేశారు. వలంటీర్ మహిళా పోలీసుకు, వారు గాజువాక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. గాజువాక ఎస్ఐ హరికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని రాంజీ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు కానీ, మృతుని కుటుంబ సభ్యుల వివరాలు గానీ తెలిస్తే, గాజువాక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఐక్య పోరాటాలతో 'ఉక్కు' పరిరక్షణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఐక్య పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికుల పోరాటానికి ఎదురులేదని, ప్రభుత్వరంగ సంస్థల విషయంలో కేంద్రప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1063వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పలువురు కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోరాడటం ఇక్కడి ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న మార్గశిర మాసోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, ఆంధ్రుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా టౌన్‌కొత్త రోడ్డు జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు దర్శనాలు నిలిపివేయనున్నారు.

29వ రోజు పూజలు: మార్గశిర మాసోత్సవాలు సందర్భంగా బుధవారం 29వ రోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించా రు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో..

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం జగన్నాథస్వామి ఆలయంలో 2,500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.